# సాక్షి శ్రీకాకుళం

మంగళవారం। 16। సెప్టెంబర్। 2025




**గంజాయి తెగులు**

సిక్కోలుకు గంజాయి తెగులు పట్టుకుంది. వినియోగం మితిమీరుతోంది.


- 8లో



**ఫిట్‌నెస్ పేరుతో దందా**

వాహనాల ఫిట్‌నెస్ పేరుతో దందా నడుస్తోంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

- 8లో



**చెరువులో పడి..**

చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఎచ్చెర్ల మండలంలో ఘటన జరిగింది.

- 8లో

## న్యూస్‌రీల్

### కేంద్రమంత్రి ప్రజల పక్షమా.. కార్పొరేట్ పక్షమా?



కార్గో ఎయిర్ పోర్టు వద్దని ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

మందస: కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రజల పక్షమా, కార్పొరేట్ పక్షమా స్పష్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ నిలదీశారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల ఆస్తులను కార్పొరేట్ ఆస్తులుగా ఎందుకు మార్చడానికి చూస్తున్నారని ప్రశ్నించారు. మందస మండలం బాహడపల్లిలో బలవంతపు భూ సేకరణ ఆపాలని, కార్గో ఎయిర్ పోర్టు రద్దు చేయాలని ఎయిర్ పోర్టు వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, జోగి అప్పారావు ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేశారు. ఢిల్లీలో కార్గో ఎయిర్‌పోర్టుకు 150 ఎకరాలు మాత్రమే ఉన్నాయని, ఇక్కడ 1400 ఎకరాలు ఎందుకని అడిగారు. కార్యక్రమంలో పొట్టి ధర్మారావు, హేమంత్ రావు, కుసుమ, కృష్ణారావు, జగన్, బాలకృష్ణ, పరశురాం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### 'మా ఎరువులు ఎటు పోతున్నాయి..?'



రావివలస ఆర్‌ఎస్‌కే వద్ద ఎరువు కోసం గుమిగూడిన రైతులు

సరుబుజ్జిలి: తమకు రావాల్సిన కోటా ఎరువులు అందించకుండా ఇతర ప్రాంతాలకు ఎలా తరలిస్తున్నారని పెద్దవెంకటాపురం, చినవెంకటాపురం, పాలవలస, రావివలస గ్రామాలకు చెందిన పలువురు రైతులు సోమవారం రావివలస ఆర్‌ఎస్‌కే వద్ద అధికారులను ప్రశ్నించారు. ఎరువు పంపిణీ సక్రమంగా లేదని రైతులు ఆగ్రహించారు. తమకు నచ్చినవారికి ఇళ్ల వద్దనే టోకెన్లు జారీ చేస్తున్నారని, దీని వల్ల క్యూలో ఉన్న రైతులకు ఒక్క బస్తా కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.3.14లక్షలు



నీలమణి దుర్గ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.3,14,385 లక్షలు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 39 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ హుండీని సోమవారం లెక్కించామని, టెక్కలి గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి టీపీ మనస్వి పర్యవేక్షించారన్నారు. కార్యక్రమంలో ఆలయ గుమస్తా సుదర్శన్, శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ తీరు దారుణం



కూటమి అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులపై, సాక్షిపై వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపే బాధ్యత మీడియాపై ఉంటుంది. రాజకీయ పార్టీలు తమ తమ కోణాల్లో రాజకీయం చేసుకోవాలే తప్ప మీడియాను వేధించకూడదు.

– దుంపల రామారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి




### ఎమర్జెన్సీని తలదన్నుతోంది



ఎమర్జెన్సీ కాలంలో కూడా పత్రికలపై సెన్సార్‌షిప్ విధించారే తప్ప కార్యాలయాలపై దాడులు చేయలేదు. కూటమి పాలన ఎమర్జెన్సీని తలదన్నేలా ఉంది. పత్రికా స్వేచ్ఛను హరించేలా 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై వరుసగా కేసులు పెడుతుండడం దారుణం. ఇది అధికార దుర్వినియోగం.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త

# సంగ్రామ సచివాలయం

గ్రామ సచివాలయాలు సంగ్రామానికి సిద్ధమవుతున్నాయి. అదనపు బాధ్యతలు, అనవసర ఒత్తిడులు, అవమానాలు, వేధింపులకు వ్యతిరేకంగా సచివాలయ ఉద్యోగుల సంఘం పిడికిలి బిగించింది. ఇంటింటికీ వెళ్లి పనిచేసే బాధ్యతలు తమకు వద్దంటూ నినదిస్తోంది. 15 రోజుల్లో తమ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే అక్టోబర్ 1 నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించింది.



గారలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

- సచివాలయ ఉద్యోగుల సమ్మె సైరన్
- సర్కారుకు 15 రోజుల గడువు ఇచ్చిన జేఏసీ
- అక్టోబర్ 1 నుంచి పోరుబాట
- ఇంటింటికీ వెళ్లే విధులను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటన



అరసవల్లి: సచివాలయం సంగ్రామ క్షేత్రంగా మారనుంది. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు అందుకుని స్వేచ్ఛగా పనిచేసిన సిబ్బందిని కూటమి ప్రభుత్వం అడుగడుగునా వేధిస్తుండడంతో తిరుగుబాటును ప్రకటించారు. తమపై తీవ్ర అసమానత, నిర్లక్ష్యం చూపిస్తున్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించారు. కానీ సర్కారులో ఏ మాత్రం చలనం రాకపోవడంతో రానున్న 15 రోజుల్లో తమ సమస్యలను పరిష్కరించాలని అల్టిమేటం జారీ చేశారు. లేదంటే అక్టోబర్ 1 నుంచి సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక పేరిట.. రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెలకు సిద్ధమవుతున్నారు.

**ఇంటింటికీ వెళ్లే విధులపై నిరసన**

జిల్లాలో మొత్తం 30 మండలాలు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస తదితర మూడు మున్సిపాలిటీలు, 912 పంచాయతీల్లో మొత్తం 835 గ్రామ సచివాలయాలు, 95 వార్డు సచివాలయాలుండగా, మొత్తం 6638 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. అలాగే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 15,211 మంది వలంటీర్లు సచివాలయాల పరిధిలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను అందజేసేవారు. ఇతరత్రా పనులకు సహాయపడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల వ్యవస్థను నిర్దాక్షిణ్యంగా రద్దు చేసేసింది. వీరి విధులను సచివాలయాల్లో రెగ్యులర్ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల నెత్తిన మోపింది. దీంతో వీరు ఏడాదిన్నరగా నలిగిపోతున్నారు. దీనికి తోడు వాట్సాప్ గవర్నెన్స్ పేరిట కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పరిపాలన విధానంలో భాగంగా.. ప్రజలకు ఇంటింటికీ ప్రభుత్వ సేవలందించేలా కార్యక్రమాలతో పాటు సర్వేల బాధ్యతలన్నీ సచివాలయ ఉద్యోగులే చేయాల్సి వస్తోంది. దీంతో తమకున్న రెగ్యులర్ విధులతో పాటు ఇంటింటికీ విధులు మరింత భారమవుతున్నాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్కార్ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

**డిమాండ్లు ఇవే..**

- ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలి.
- సచివాలయాల ఉద్యోగులను ఆయా విభాగ శాఖలైన మాతృశాఖలకు అప్పగించాలి.
- ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా బలవంతపు విధుల ఆదేశాల నుంచి విముక్తి కల్పించాలి.
- ప్రొబేషన్ సమయంలో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలి.
- ఆరేళ్ల పాటు ఒకే క్యాడర్‌లో సర్వీస్ చేసిన వారికి ఏఏఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి.
- రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా అప్‌గ్రేడ్ చేయాలి.
- అన్ని విభాగాల వారికి ప్రమోషన్ చానెళ్లు ఏర్పాటు చేసి జిల్లాల వారీగా సీనియారిటీ జాబితాను విడుదల చేయాలి.

| గ్రామ సచివాలయాలు | వార్డు సచివాలయాలు | సచివాలయ ఉద్యోగులు |
|---|---|---|
| 835 | 95 | 6638 |

### సమ్మెకు సన్నద్ధం



తీవ్ర పనిభారం, ఒత్తిళ్లతో పాటు ఇంటింటికీ వెళ్లి విధులు నిర్వర్తించే విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ ప్రతినిధులంతా ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాన్ని అందించారు. ఈ మేరకు 15 రోజుల్లోగా డిమాండ్లు నెరవేర్చకపోతే వచ్చే నెల 1 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతాం. ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర నేతలను కూడా కలిసి వారి సలహాసూచనల ప్రకారం ముందుకు వెళ్తాం.

– కూన వెంకట సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగుల సంఘ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్

### నిరసనలు తీవ్రం

రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల ఉద్యోగులంతా ఒకే మాటగా.. ఒకే బాటగా ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ప్రభుత్వ పెద్దలకు వినతిపత్రాలను సమర్పించారు. అయితే ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా తమ నిరసనల స్థాయి పెంచాలని సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నిర్ణయించింది. ఈ క్రమంలో రానున్న 15 రోజుల తర్వాత ఉద్యోగులంతా నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు జిల్లాల నుంచి జేఏసీ ప్రతినిధులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఏపీఎన్‌జీఓ సంఘంతో కలిసి పోరాడాలని నిర్ణయించుకున్నారు. దీంతో అక్టోబర్ 1 నుంచి నిరవధిక సమ్మెకు ప్రకటన వెలువడింది.

### వలస వెళ్లిన మనిషి తిరిగి రాలేదు



బాధితుల మొర వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

- ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌లో విన్నవించిన మహిళ
- నాలుగేళ్లుగా భర్త జాడ తెలియడం లేదని ఆవేదన
- గ్రీవెన్స్‌సెల్‌కు మొత్తం 55 ఫిర్యాదులు

**ఎస్పీ గ్రీవెన్స్ ఫోకస్**

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి సోమవారం నిర్వహించే ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు ఈ వారం ఓ అరుదైన వినతి వచ్చింది. నాలుగేళ్లుగా భర్త జాడ తెలియక నరకయాతన పడుతున్న మహిళ తన పెనిమిటి జాడ కనుక్కుని చెప్పాలని ఎస్పీని వేడుకున్నారు. వలస వెళ్లిన మనిషి నుంచి ఇంతవరకు ఎలాంటి సమాచారం రాలేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే..

వజ్రపుకొత్తూరు మండలం పెద్దబొడ్డపాడు పంచాయతీ కొల్లిపాడుకు చెందిన పుచ్చ అనసూయమ్మ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌కు హాజరయ్యారు. తన భర్త పుచ్చ కూర్మారావు జాడ నాలుగేళ్లుగా తెలియరావడం లేదని ఆమె ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ముందు మొర పెట్టుకున్నారు. 2014 నుంచి సౌదీఅరేబియాకు తన భర్త వలస వెళ్లే వారని, చివరి సారిగా 2021లో కింగ్‌డమ్ ఆఫ్ సౌదీ అరేబియాలోని దమ్మంలో ఏఎల్-మాష్రిక్ ట్రేడింగ్ అండ్ కాంట్రాక్టింగ్ కంపెనీకి వెళ్లారని, అప్పటి నుంచి ఆయన గురించి ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. ఢిల్లీలో ఉన్న ఎంబసీలో కూడా దీనిపై ఫిర్యాదు చేశామన్నారు. పలుమార్లు వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌కు తిరుగుతున్నా పట్టించుకోలేదని, మీరైనా జాడ కనుగొని చెప్పాలని ఎస్పీ వద్ద బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

- ఈ వారం గ్రీవెన్స్‌కు 55 ఫిర్యాదులు అందాయి.
- పొందూరు మండలం వీఆర్ గూడేనికి చెందిన సువ్వారి సన్యాసమ్మ తన ఇంటిలో జరిగిన దొంగతనం కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.
- తనపై జరిగిన దాడి కేసులో సాక్షులుగా ఉన్న వారిని బెదిరిస్తున్నారని శ్రీముఖలింగానికి చెందిన పూజారి నాయుడు గారి రాజశేఖర్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తనకు బెదిరింపులు వస్తున్నాయని ఫిర్యాదు చేసినా బైండోవర్ చేయడం లేదని తెలిపారు.
- ఓ ఫైనాన్స్ వ్యాపారి తన చెక్కును దుర్వినియోగం చేసి తన బ్యాంకు ఖాతా నుంచి రూ.45 వేలు కాజేశాడని, న్యాయం చేయాలంటూ శ్రీకాకుళంలోని బలగకు చెందిన కె.రామారావు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- శ్రీకాకుళం సబ్‌డివిజన్‌కు చెందిన ఓ ఇంజినీరింగ్ యువకుడు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.15 లక్షలు నష్టపోయానని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

### తినేస్తున్నాడెమో..!



- వైద్యారోగ్య శాఖలో అక్రమాలకు కేంద్రంగా 'డెమో' విభాగం
- పలు దినోత్సవాల ప్రచారాల పేరిట దోపిడీ
- ప్రతి నెలా తనిఖీల పేరిట రూ.లక్షల్లో వసూలు చేస్తున్న విభాగాధికారి



అరసవల్లి: అది వైద్యారోగ్య శాఖ. అందులో ఓ విభాగం పేరు డెమో. అంటే జిల్లా మాస్ మీడియా, విస్తరణ విభాగం. అందులో ఓ అధికారి అంతా తానై వ్యవహరిస్తూ ప్రభుత్వ నిధులు తినేస్తున్నాడేమో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**దినోత్సవాలొస్తే పండుగే**

జిల్లా వ్యాప్తంగా వైద్యారోగ్య శాఖకు చెందిన ఏ దినోత్సవ ఏర్పాట్లు, ప్రచార నిర్వహణ అయినా ఈ డెమో విభాగానికి పండగే. వార్షిక బడ్జెట్ కేటాయింపుల ప్రాప్తికి బిల్లులు పెట్టేసి ఎంచక్కా నిధులను మింగేస్తున్నారు. చిన్నపాటి అవగాహన కార్యక్రమానికైనా కరపత్రాల పంపిణీ, పత్రికల ప్రకటనలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు పేరిట రూ.లక్షల్లో ప్రభుత్వ నిధులు ఆ అధికారి జేబుల్లోకి వెళ్తున్నాయనే ఆరోపణలున్నాయి. శాఖకు సంబంధించిన పలు దినోత్సవాలు, కార్యక్రమాలు జరిగే సందర్భాల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, సచివాలయాల వద్ద కరపత్రాలను అంటించాలి, బ్యానర్లు పెట్టించాలి. అయితే ఇలాంటి చర్యలేవీ జిల్లాలో కానరావడం లేదు. కానీ బడ్జెట్ కేటాయింపులు మాత్రం జరిగిపోతున్నాయి. ఈ అధికారి తన బృంద సిబ్బంది సహకారంతో తప్పుడు బిల్లులు, నకిలీ బిల్లులు ఫోర్జరీ సంతకాలతో రోజులు చూపించి బిల్లులు చేయించుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన జనాభా దినోత్సవానికి ప్రభుత్వం రూ.లక్ష కేటాయిస్తే వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకున్నవారికి ప్రోత్సాహంగా రూ.55 వేలు కేటాయించగా మిగిలిన మొత్తాన్ని దినోత్సవ ఏర్పాట్లు పేరిట బిల్లులు పెట్టేశారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి పాత బ్యానర్‌తోనే పలు ప్రైవేటు నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ చేసి బిల్లులు చేసుకున్నారు.

**తనిఖీల పేరిట రూ.లక్షల్లో వసూలు**

జిల్లాలో అన్ని ప్రైవేటు క్లినిక్‌లు, ల్యాబ్‌లను ఈ డెమో బృందమే తనిఖీ చేస్తుంది. ఇలా తనిఖీల పేరిట ఒక్కో ఆస్పత్రి, ల్యాబ్‌ల నుంచి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. ఇందులో జిల్లా శాఖకు చెందిన కీలక అధికారికి కూడా వాటా ఇస్తుండడంతో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే క్లీన్‌చిట్ వస్తోంది. బెడ్‌లను బట్టి ఒక్కో నర్సింగ్ హోం నుంచి సుమారు రూ.50 వేల వరకు, ల్యాబ్‌ల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నారు. ఐవీఎఫ్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లయితే అడిగినంత ఇవ్వాల్సిందే.

### 'పాఠశాలల రక్షణ కోసమే రణభేరి'



పలాసలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లును అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

శ్రీకాకుళం: ప్రభుత్వ పాఠశాలల రక్షణ కోసం, విద్యార్థుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ రణభేరి జాతర కార్యక్రమం జరుగుతుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పలాస కేంద్రంలో బస్టాండ్ దగ్గర రణభేరి కార్యక్రమాన్ని డప్పు మోగించడం ద్వారా ప్రారంభించారు. శ్రీకాకుళంలో యూటీఎఫ్ కార్యాలయం వద్ద ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను విమర్శించారు. టీచర్లకు అదనపు పనులు చెప్పడం సరికాదన్నారు. పిల్లలకు అక్షరం నేర్పించే సమయం కూడా ఇవ్వడం లేదని అన్నారు. పలాసలో పోలీసులు కార్యక్రమానికి విఘాతం కలిగించడం సరికాదన్నారు. ఈ రణభేరి ప్రచార జాత సెప్టెంబర్ 25న గుంటూరు పట్టణంలో ముగుస్తుందని తెలిపారు.

### రేపు వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం విస్తృత స్థాయి సమావేశం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దళితులపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుని ఎండగట్టేందుకు, దళితులందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ఈ నెల 17వ తేదీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి, జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ అన్ని నియోజకవర్గ ఇన్‌చార్జిలు హాజరవ్వనున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల బృందావనంలో కార్యక్ర మం నిర్వహించనున్నట్లు తెలిపారు.



**• పరేషన్**

జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఈ వృద్ధ దంపతులు నిస్సహాయంగా కనిపించారు. జిల్లా కేంద్రంలోని దమ్మలవీధి సమీపంలోని లెప్రసీ కాలనీకి చెందిన సూర్యనారాయణ, దాలమ్మ దంపతులకు రేషన్ కార్డే ఆధారం. కానీ ఆ ఆధారాన్ని ప్రభుత్వం తొలగించడంతో అధికారులకు విన్నవించుకోవడానికి ఇలా వచ్చారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

### రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పెద్దమడి విద్యార్థులు

మెళియాపుట్టి: జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెద్దమడి ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా ఇద్దరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు సోమవారం ప్రిన్సిపాల్ లక్ష్మునాయుడు, వైస్ ప్రిన్సిపాల్ రామానంద్, పీడీ లక్ష్మణమూర్తి తెలిపారు. అండర్ 18 విభాగంలో లాంగ్ జంప్‌లో ఎం.కృపాసింధు, 110 హడిల్స్ మీటర్లలో బి.గోవింద్ ప్రథమస్థానంలో నిలిచి అంతర్ రాష్ట్ర క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



అంతర్ రాష్ట్ర క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

# కొండకు గుండు

- కొండకుంకాంలో అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు
- రెండు రోజులుగా ఇదే తంతు



కొండకుంకాం గ్రావెల్ కొండపై అక్రమంగా తవ్వకాలు జరిపిన ప్రదేశం



లే-అవుట్‌కు అక్రమంగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్

రణస్థలం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు చేస్తున్న అడ్డగోలు గ్రావెల్ దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయింది. లావేరు మండలంలోని కొండకుంకాం గ్రామంలో సర్వే నంబర్ 1లో 374 ఎకరాల గ్రావెల్ కొండ ఉంది. ఇందులో కొంతమందికి డీ-పట్టాలు మంజూరు చేసి ఉన్నారు. అధికారంలోకి రాగానే ఈ కొండపై కూటమి నాయకుల కన్ను పడింది. ఆదివారం రాత్రి నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, జేసీబీతో కొండ గ్రావెల్‌ను కొల్లగొడుతూనే ఉన్నారు. సోమవారం స్థానికులు మీడియాకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు వెళ్లి చూసే సరికి.. సగం కొండను మాయం చేసేశారు. వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా వాళ్లు అక్కడి దృశ్యాలు చూసి విస్మయం చెందారు.

**గ్రామ రెవెన్యూ అధికారుల పాత్రపై అనుమానం**

కొండకుంకాం రెవెన్యూ పరిధికి చెందిన గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ ఇద్దరూ ఒకే రోజు సెలవు పెట్టడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో గ్రావెల్ తరలిస్తున్నా పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పైడి హారతి, ఇతర రెవెన్యూ అధికారులు కొండను సందర్శించి వివరాలు సేకరించారు.

**ఎక్కువగా తవ్వేశారు**

కొండకుంకాం కొండను సందర్శించాం. బాగా ఎక్కువగా తవ్వేసి ఉంది. గ్రామ వీఆర్వో, వీఆర్ఏ ఇద్దరూ సెలవులో ఉన్నారు. పూర్తి స్థాయిలో వివరాలు సేకరిస్తాం. ఇక్కడ తవ్వకాలకైతే అనుమతులు లేవు.

– పి.హారతి, ఆర్ఐ

**అనుమతులు లేవు**

కొండకుంకాం గ్రావెల్‌కు అనుమతులు లేవు. సిబ్బందిని పంపించి పరిశీలన చేయమని చెబుతాను. వివరాలు సేకరించి తగు చర్యలు తీసుకుంటాం.

– జీఎల్‌ఈ శ్రీనివాసరావు, తహసీల్దార్

## క్లుప్తంగా

### సివిల్ సర్వీస్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలి

ఎచ్చెర్ల: విద్యార్థులు సివిల్ సర్వీస్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని జీఎస్టీ పన్నుల విభాగం (విశాఖపట్నం) డిప్యూటీ కమిషనర్ డి.డేవిడ్ అనిల్ కుమార్ సూచించారు. స్థానిక బీఆర్ ఏయూ సెమినార్ హాల్‌లో రీసెర్చ్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఫ్రమ్ ప్రొఫెషనల్ టు పాలసీ మేకర్స్ – సివిల్ సర్వీస్ ఏ కెరీర్ ఆప్షన్ అనే అంశంపై ప్రసంగించారు. డిగ్రీ కనీస అర్హత ఉన్నవారు సివిల్ సర్వీస్ పరీక్షను రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. సివిల్ సర్వీస్ కెరీర్ ఎంతో ఉన్నతమైన కెరీర్ అని, ప్రజాపాలన, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా ప్రజలకు చేరువుగా ఉండవచ్చన్నారు. అనంతరం డేవిడ్ అనిల్ కుమార్‌ను వీసీ కేఆర్ రజనీ తదితరులు సత్కరించారు.

### వ్యక్తిపై కేసు నమోదు

మెళియాపుట్టి: తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం కేసు నమోదయ్యింది. ఎస్ఐ పిన్నింటి రమేష్ బాబు తెలిపిన వివరాల మేరకు.. దీన బంధుపురం గ్రామ పంచాయతీ చింతల పోలూరు గ్రామానికి చెందిన ఒక మహిళ పొలం గట్లపై నుంచి నడిచి వస్తుండగా.. ఎగువ చింతలపోలూరు గ్రామానికి చెందిన సవర రవి అనే వ్యక్తి ఆమెపై అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో మహిళ ప్రతిఘటించగా ఆమెను కొట్టి గాయపరిచినట్లు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మహిళ ఆత్మహత్య

రణస్థలం: మండలంలోని మురపాక పంచాయతీ టి.బి.నగర్ కాలనీకి చెందిన పొట్నూరు వెంకటరత్నం (54) అనే మహిళ గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు లావేరు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఉన్నటువంటి గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించింది. మృతురాలికి భర్త శ్రీనివాసరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

శ్రీకాకుళం క్రైమ్: గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో గార మండలం సానివాడకు చెందిన ముద్దాడ అప్పలరాజు (44)కు తీవ్ర గాయాలయ్యాయని ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ సోమవారం తెలియజేశారు. అప్పలరాజు పెద్దపాడు రామిగెడ్డ సమీప వైన్‌షాపులో వెయిటర్‌గా పనిచేస్తున్నాడన్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పదిన్నర ప్రాంతంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా, అరసవల్లి ఆలయ ఆర్చి సమీప పెట్రోల్ బంక్ వద్ద గార వైపు నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో అప్పలరాజు తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయని, వెంటనే 108లో రిమ్స్ ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. ప్రస్తుతం అపస్మారక స్థితిలోనే అప్పలరాజు ఉన్నట్లు వెల్లడించారు. క్షతగాత్రుని సోదరుడు సింహాచలం సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న గ్రోసు సుబ్బారావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గాండ్ల తెలుకుల కార్పొరేషన్ ఏర్పాటుకు రాజకీయాలకు అతీతంగా గాండ్ల తెలుకుల సామాజిక వర్గమంతా కృషి చేయాల్సిన అవసరం ఉందని అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు పిలుపునిచ్చారు. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో అఖిల గాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశం శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు కొమనాపల్లి లక్ష్మణ్ ప్రసాద్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అనేక సామాజిక వర్గాలకు కుల కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ, గాండ్ల తెలుకుల సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. తమకన్నా జనాభా తక్కువ కలిగిన సామాజిక వర్గాలు రాజ్యాధికారంలో భాగస్వామ్యులయ్యారని, తమనెందుకు చిన్నచూపు చూస్తున్నారో చెప్పాలని మండిపడ్డారు. అమరావతిలో త్వరలో గాండ్ల తెలుకుల సామాజికవర్గం శంఖారావం కార్యక్రమం చేపట్టి తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివాణి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం, కార్యవర్గ ప్రతినిధులు గిద్దలూరు ప్రభాకర్‌రావు, గార్లదిన్నె నాగరాజు, బచ్చల పుల్లయ్య, తిరుపతి హరి గోపాల్, అంబటి గురుమూర్తి, డాక్టర్ కల్లేపల్లి కూర్మనాథ్ తదితరులు పాల్గొన్నారు.



● చిక్కోలుకు...

# గంజాయి తెగులు..!



- చాపకింద నీరులా విస్తరిస్తున్న వైనం
- ఇతర ప్రాంతాల్లోని యూనివర్సిటీలు, స్టడీ సెంటర్లలో విక్రయం
- ఇటీవల దొరికిన 10 మంది నిందితులు

శ్రీకాకుళం క్రైమ్/రణస్థలం:

ఒడిశాలో పుట్టిన గంజాయి వనం.. సిక్కోలు జిల్లాలో విస్తరిస్తోంది. ఈ గంజాయి ప్రముఖ యూనివర్సిటీలు, కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్లలో చదువుకునే విద్యార్థులే లక్ష్యంగా చేరుతోంది. ఒడిశా సాగుదారుని నుంచి రూ.1,500లు, రూ.2,000ల ధరకు కొనుగోలు చేసి వివిధ ప్రాంతాల్లో డిమాండ్ ఆధారంగా రూ.50 వేల వరకు అమ్ముతున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. సరదాగా గంజాయి తాగడంతో మొదలవుతున్న జీవితాలు దొంగతనాలు, దోపిడీలు, అత్యాచారాలు, హత్యాయత్నాలు, హత్యలు చేసే స్థాయికి దిగజారుతున్నాయి. దీంతో అనేక కుటుంబాలు తీవ్ర వేదనకు గురవుతున్నాయి. తాజాగా జేఆర్‌పురం పోలీసులకు పట్టుబడిన 10 మంది నిందితుల్లో ఐదుగురిని విచారించగా దీని వెనక పెద్ద లింకే ఉందని తెలుస్తోంది. ప్రధానంగా కళాశాలలు, యూనివర్సిటీలు, కోచింగ్ సెంటర్ల వద్ద విద్యార్థులను టార్గెట్‌గా చేసుకొని భారీ ధరలకు విక్రయాలు చేస్తున్నట్లు తెలుసుకున్నారు. సీఐ ఎం.అవతారం పర్యవేక్షణలో ఎస్ఐ చిరంజీవి ఆ దిశగా దర్యాప్తు మొదలుపెట్టారు.

**ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో..**

పట్టుబడిన పదిమంది నిందితుల్లో ఐదుగురు కొనుగోలుదారులు కాగా.. మరో ఐదుగురు కొనుగోలు చేయడంతో పాటు వాటిని సరఫరా చేసేవారిగా ఉన్నారు. అందరూ పాతికేళ్లలోపు యువకులే. వీరిలో ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన బగాన పవన్‌కుమార్‌దే కీలక పాత్ర. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పాత్తంగికి చెందిన గుంత శుక్ర వద్ద కిలో గంజాయి రూ.7 వేల లెక్కన ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేసి, పట్టుబడిన మిగతా నిందితులతో పాటు తన నెట్‌వర్క్‌లో ఉన్నవాళ్లకు సరఫరా చేస్తుంటాడు. గంజాను ప్యాకెట్లుగా విడదీసి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రం బెంగుళూర్ వరకు వ్యాపారం చేసేందుకు కూడా వెళ్తాడు. కిలో రూ.7 వేలకు తనకొచ్చే గంజాయిని రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు జిల్లాలో అమ్ముతాడు. బెంగుళూర్, హైదరాబాద్‌ల్లో అయితే రూ. 25 వేలు నుంచి రూ. 30 వేలు వరకు అమ్ముతాడు. ఇతని తర్వాత విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొత్త కొప్పెర్లకు చెందిన ఇనకోటి ముకుంద సహాయకారిగా ముఖ్యపాత్ర పోషిస్తాడు. ఒడిశాకు పవన్‌తో పాటు వెళ్లడం, మాల్ తీసుకొని వచ్చి వారి గ్రామం, చుట్టుపక్కల గ్రామస్తులకే కాకుండా విజయవాడ వరకు వెళ్లి ముఖ్య ప్రాంతాల్లోని కొన్ని యూనివర్సిటీలు, కళాశాలల విద్యార్థులకు కొందరిని లింక్‌గా చేసుకుని విక్రయాలు చేస్తాడు.

**ముగ్గురు మిత్రులు**

శ్రీకాకుళం పెద్దరెల్లివీధికి చెందిన తుపాకుల అనిల్ కుమార్ విశాఖపట్నంలోని తాటిచెట్లపాలెంలో చదువుకుంటున్నాడు. ఇతను బగాన పవన్ దగ్గర గంజా కొనుక్కొని తాటిచెట్లపాలెంలో ఫ్రెండ్స్‌కు అమ్ముతుంటాడు. అలాగే ఎచ్చెర్ల సాయినగర్‌కు చెందిన లక్కవరపుకోట పవన్‌కుమార్, జోగేంద్రప్రసాద్‌లు మిత్రులు కావడంతో వారితో కలిసి గంజాయి సేవించడం చేస్తుంటాడు. ఆపై తమ తమ గ్రామాల్లో, వేరే గ్రామాల్లోని ఫ్రెండ్స్‌కు గంజాను అధిక రేటుకు అమ్ముతుంటారు.

**ఆ ముగ్గురూ దొరికితే..**

అయితే పోలీసుల దర్యాప్తులో పట్టుబడిన నిందితులు మరో ముగ్గురి పాత్రపై గుట్టువిప్పారు. వీరిలో శ్రీకాకుళం నగరానికి చెందిన బగాన సౌమిత్ హైదరాబాద్‌లో కాంపిటేటివ్ కోర్సుకై కోచింగ్ నిమిత్తం వెళ్లాడని, అక్కడ ఒక ప్రముఖ యూనివర్సిటీలో విద్యార్థులకు గంజాను విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఎచ్చెర్లకు చెందిన మరో యువకుడు మొదలవలస సందీప్ బెంగుళూర్‌లో చదువుతున్నాడని, అక్కడ డిగ్రీ, ఇంజినీరింగ్ చదివే విద్యార్థుల కోచింగ్ సెంటర్ల వద్దకు వెళ్లి గంజా అమ్ముతుంటాడు. వీరిరువురూ అక్కడుండే డిమాండ్ ఆధారంగా కిలో గంజాయిని చిన్న, చిన్న ప్యాకెట్లుగా చేసి సుమారు కిలో రూ.50 వేలు పైబడి అమ్ముతారు. శ్రీకాకుళం ఇంటికి వచ్చినప్పుడు బగాన పవన్‌కుమార్ వద్ద రెండు కిలోల నుంచి నాలుగు కిలోల వరకు కొనేసి హైదరాబాద్, బెంగుళూర్ పట్టుకుపోతారు. కొన్నిమార్లు ఒడిశా కూడా వెళ్లి కొంటారు. మరో కీలక యువకుడు జోగేంద్రప్రసాద్ బగాన పవన్‌కుమార్‌తో కలిసి బెంగుళూర్ తరచూ మాల్ పట్టుకు వెళ్తుంటాడని, ఫ్రెండ్ సర్కిల్‌తో దూకుడుగా ఉంటూ ఎచ్చెర్ల పరిసరాల్లో గట్టిగా గంజా తాగి హల్‌చల్ చేస్తుంటాడని చెబుతున్నారు. వీరి ముగ్గురిని పట్టుకుంటే వెనకుండే మరికొన్ని లింక్‌లు దొరకొచ్చనే భావనలో పోలీసులున్నారు.

**చిత్ర విచిత్ర పేర్లతో..**

గంజాయి విక్రయాలు, కొనుగోళ్లలో వీరిని చిత్ర, విచిత్ర పేరులతో పిలుస్తుంటారు. ఒడిశాకు చెందిన గుంత శుక్ర మారుపేరు భత్రి కాగా, జోగేంద్రప్రసాద్ మారుపేరు డ్యానీ, పట్టుబడిన కొనుగోలుదారుల్లో ఆళ్లవెంకటరావు మారుపేరు కొత్త సైకిల్, సురవరపు ప్రసాద్ మారుపేరు డీజేలుగా చెబుతున్నారు.

● పాఠశాలను తరలిస్తే సహించేది లేదు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

బూర్జ: మండలంలోని అల్లెన గ్రామ ఎంపీయూపీ పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలని, వేరే పాఠశాలకు తరలిస్తే సహించేది లేదని గ్రామ సర్పంచ్ జడ్డు మహేష్‌తో పాటు పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. దీంతో ఎంఈవోలు ఎన్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు కలగజేసుకొని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో డీఈవో ఎ.రవిబాబు, డిప్యూటి డీఈవో ఆర్.విజయకుమార్‌లు వచ్చి గ్రామస్తులకు నచ్చజెప్పారు. పాఠశాలను గ్రామంలో కొనసాగిస్తామని, వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులంతా ఆందోళన విరమించి హర్షం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మురపాక శంకరరావు, సరుబుజ్జిలి పోలీసుస్టేషన్ ఎస్ఐ బి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

### బహు భాషా కోవిదుడు రోణంకి



రోణంకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

టెక్కలి: బహు భాషా కోవిదుడు రోణంకి అప్పలస్వామి అని సాహిత్య సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. సోమవారం టెక్కలిలో రోణంకి అప్పలస్వామి 116వ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కవులకు మార్గదర్శకుడు రోణంకి అప్పలస్వామి అని వక్తలు పేర్కొన్నారు. తెలుగు భాషలోని నవలలను ఫ్రెంచ్ భాషలోకి అనువదించడంతో పాటు ఫ్రెంచ్, జర్మనీ, లాటిన్ వంటి భాషల్లో సాహిత్య సంపదను ఖండాంతరాలకు చాటి చెప్పిన మహోన్నతమైన వ్యక్తి రోణంకి అప్పలస్వామి అని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో జీవి రెడ్డి, సీహెచ్ ప్రభాకరరావు, గుంట లీలావరప్రసాద్, కె.ధనుంజయరావు, ఎస్.వెంకటఅనిల్, బి.అయ్యబాబు, ఆర్.రామచంద్రరావు, డీపీ స్టాలిన్, కె.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడి మృతి

ఎచ్చెర్ల: మండలంలోని బడివానిపేట గ్రామానికి చెందిన బి.లోకేష్ (17) కొయ్యాం సమీపంలోని చెరువులో పడి మృతి చెందాడు. ఆదివారం సెలవు కావడంతో చెరువులోకి స్నానానికి వెళ్లిన లోకేష్ లోతుగా దిగిపోవడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలియజేశారు. మృతుడి తల్లి నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు. లోకేష్‌కు నాన్న సత్యయ్యతో పాటు ఒక తమ్ముడు, చెల్లి ఉన్నారు. మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# ఫిట్‌నెస్ పేరుతో దందా..!



వేచివున్న వాహనాలు

- కమీషన్ ఇస్తేనే సర్టిఫికెట్ మంజూరు
- ఒక్కో వాహనానికి ఒక్కో రేటు ఫిక్స్
- అంతా ఏజెంట్లుతోనే నడుస్తున్న వైనం
- పట్టించుకోని ఆర్టీఏ అధికారులు

శ్రీకాకుళం రూరల్: నగర పరిధిలోని కిమ్స్ రహదారి, జిల్లా వ్యవసాయ కార్యాలయానికి అనుసరించి ఇటీవల ఏర్పాటు చేసిన ఆర్టీఏ కార్యాలయానికి అనుబంధంగా నడుస్తున్న ఫిట్‌నెస్ సెంటర్ (గవర్నమెంట్ అప్రువుడ్ ఆటోమేటిడ్ టెస్టింగ్ స్టేషన్)లో అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రతీ వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాలనే ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి తొక్కి ఆయా వాహనాలకు కమీషన్లు తీసుకుంటూ సర్టిఫికెట్లు అందిస్తున్నారు.

**ముక్కుపిండి వసూళ్లు**

జిల్లాలోని ట్రాన్స్‌పోర్టు, నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలకు సంబంధించి ఇక్కడ నుంచే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కారు, బస్సు, ఆటో, లారీ ఏ వాహనమైనా ప్రభుత్వానికి కట్టాల్సిన చలానా కేవలం రూ.1,000 నుంచి రూ.2,000ల లోపు ఉంటుంది. కానీ ఇక్కడ ఏజెంట్లకు మాత్రం ఆయా వాహనాలకు సుమారు రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు కమీషన్ ముట్టజెప్తేనే లోపలికి అనుమతి ఇస్తారు. లేదంటే వాటిని గేటు నుంచి వెనక్కి పంపేస్తారు. పొరపాటున ఎవరైనా రికమెండేషన్ ద్వారా కేవలం ప్రభుత్వ చలానా మాత్రమే తీసి టెస్టింగ్‌కు పంపిస్తే మాత్రం, లేనిపోని కారణాలు చెప్పి ఫిట్‌నెస్ ఫెయిల్ చేసిన సందర్భాలు కూడా కోకొల్లలు.

**గంటల కొద్దీ నిరీక్షణ**

కొన్నేళ్ల క్రితం వరకు ఆర్టీఏ అధికారుల ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కావాలంటే క్షణాల్లోనే ఇచ్చేవారు. ఆయా వాహనాలకు సంబంధించిన కాగితాలు చూసి ఆర్టీఏ సిబ్బంది వాహనాన్ని డ్రైవింగ్ చేసి పంపేవారు. కానీ ప్రస్తుతం ఫిట్‌నెస్ కేంద్రంలో ఏదైనా వాహనం లోపలికి వెళ్తే మాత్రం గంటల కొద్దీ నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఉదయం వెళ్లిన బండ్లు సాయంత్రానికే తిరిగి వస్తాయి. దీంతో సహనం కోల్పోతున్న వాహన డ్రైవర్లు ఫిట్‌నెస్ కేంద్ర సిబ్బందితో వాగ్వివాదం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.



బయట నిరీక్షిస్తున్న వాహన డ్రైవర్లు

**అంతా ఏజెంట్ల సమక్షంలోనే...**

గత ప్రభుత్వంలో ఆర్టీఏ పనులు వాహన్ యాప్‌లో, స్థానిక సచివాలయంలోనూ త్వరితగతిన జరిగేవి. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఏజెంట్లతోనే అంతా కమీషన్ పద్ధతిలో ఫిట్‌నెస్ కేంద్రంలో జరగడం గమనార్హం. ప్రతీ ఫైల్‌కు ఒక్కో రేటు పెట్టి ఆ రేటును ఏజెంట్లకు ముట్టజెప్పితేనే బండికి ఫిట్‌నెస్ అందిస్తారు. ఇంత వ్యవహారం జరుగుతున్నా నియంత్రించాల్సిన ఆర్టీఏ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తనట్లు ఉంటున్నారని వాహన డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**అదనంగా రూ.3 వేలు**



నేను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కారు లోను తీసుకున్నాను. నాది టాక్సీబోర్డు. రెండు రోజులు క్రితం ఫిట్‌నెస్ చేయించాను. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చలానా రూ.1,000లు తీశారు. కానీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరు చేయడానికి అదనంగా మరో రూ.3 వేలు కేంద్రంలోని సిబ్బందికి ముట్టజెప్పాల్సి వచ్చింది.

– టి.శ్రీనివాసరావు, పొందూరు

**మా చేతిలో ఏమీ లేదు**



ఒకప్పుడు వాహనానికి ఫిట్‌నెస్‌లు మా ఆర్టీఏ పరిధిలో ఉండేవి. ఇప్పుడు అంతా ప్రైవేటుపరం అయ్యింది. దీంతో మా చేతిలో ఏమీ ఉండడం లేదు. వాహన ఫిట్‌నెస్‌కు సంబంధించి చాలా మంది డ్రైవర్లు, వాహన యజమానుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని చేరవేశాం. – ఎ.విజయసారథి,

ఉప రవాణా శాఖాధికారి, శ్రీకాకుళం

## అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- మీకోసంలో 81 అర్జీలు స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 81 అర్జీలను స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎస్‌వీ శ్రీధర్‌రాజ పాల్గొన్నారు.

**అర్జీలను పరిశీలిస్తే...**

- ప్రభుత్వం పేద దళిత కుటుంబాలకు ఉచిత కరెంట్ పథకం ఇస్తున్నప్పటికీ.. విద్యుత్ శాఖ అధికారులు ఎటువంటి బిల్లులు ఇవ్వకుండా డబ్బులను తీసుకుంటున్నారని గార మండలానికి చెందిన కె.మల్లేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తమ గ్రామంలో సుమారుగా 200 దళిత కుటుంబాలు ఉన్నాయని, వారి నుంచి అనధికారికంగా డబ్బులు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

**ఏపీఎం వేధిస్తున్నారు..**

- వెలుగు డీఆర్‌డీఏ పలాస మండలం బ్రాహ్మణతర్ల క్లస్టర్‌లో పనిచేస్తున్న దళిత కుటుంబానికి చెందిన ఇప్పిలి ధనలక్ష్మిని వజ్రపుకొత్తూరు మండలం ఏపీఎం ప్రసాదరావు వేధిస్తున్నాడని ఆమె ఫిర్యాదు చేసింది.

- ఎల్ఎన్‌పేట మండలంలోని మోదుగవలస గ్రామంలో గ్రామ సరిహద్దులో ఉన్న సుమారు 175 ఎకరాల జిరాయితీ భూమిని రెవెన్యూ అధికారులు రీసర్వేలో గ్రామ కంఠంగా మార్చేశారని ఆ గ్రామానికి చెందిన రైతుల ఫిర్యాదు చేశారు.
- ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణం చేయడం జరిగిందని, ఆ గదులు ఉన్న స్థలాన్ని రెవెన్యూ రికార్డుల్లో పాఠశాల స్థలంగా మార్పులు చేయాలని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు కోరారు.
- జిల్లాలోని రైతులకు సకాలంలో యూరియా తదితర ఎరువులు అందజేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు కోరారు. యూరియాను అధిక ధరలకు కూటమి నాయకులు అమ్ముకుంటున్నారన్నారు.



వెన్నెలవలస గ్రామంలో ఇటీవల పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ముకుమ్మడిగా తీర్మానం చేసిన ఆదివాసీలు

# థర్మల్ ప్లాంట్ వద్దంటే వద్దు

- థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఆదివాసీల పోరాటం
- పనులు ఆపకపోతే ఉద్యమ బాట తప్పదని హెచ్చరిక
- సర్వేలు, బలవంతపు భూసేకరణ వద్దని విన్నపం

బూర్జ: బూర్జ, సరుబుజ్జిలి రెండు మండలాల్లో కూటమి ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన థర్మల్ క్రిటికల్ సూపర్ ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఆదివాసీలు ఆందోళనలు చేస్తున్నారు. రెండు మండలాల్లో గిరిజన గ్రామాలైన గోపిదేవిపేట, మసానపుట్టి, బూర్జ మానుగూడ, జంగాలపాడు, బొడ్లపాడు, జేవీ పురం, అనంతగిరిపేట, సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస 1, వెన్నెలవలస 2 తో పాటు 27 గిరిజన గ్రామాల ప్రజలు థర్మల్ ప్లాంట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ రెండు మండలాల్లో సుమారు 1600 ఎకరాల్లో 3200 మెగా వాట్ల విద్యుత్ తయారీకి ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. కానీ అతి ప్రమాదకరమైన ఈ ప్లాంట్ తమ ప్రాంతంలో వద్దే వద్దని గిరిజనులు అంటున్నారు. ప్లాంట్‌కు వ్యతిరేకంగా భారీగా ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. తోటి గిరిజన గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పిస్తున్నారు. సర్వేలు, బలవంతపు భూసేకరణ వెంటనే ఆపాలని, ఆదివాసీల బతుకులు నాశనం చేయవద్దని కోరుతున్నారు.



పవర్ ప్లాంట్ నిర్మాణం స్థలం

**ప్రాణాలైనా అర్పిస్తాం**



ప్రాణాలైనా అర్పిస్తాం గానీ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఒప్పుకోం. ఈ ప్లాంట్ వస్తే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉంటుంది. దాదాపు 20 కిలోమీటర్లు రేడియేషన్ సమస్య ఉంటుంది. గిరిజనులమంతా ఏకతాటిపై ఉంటాం.

– బాడంగి సురేష్ దొర, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు

**ఎదురించి తీరుతాం**



మాకు తాతల నుంచి వచ్చిన పోడు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్నాం. మా బతుకులు నాశనం చేయొద్దు.

– సవర సింహాచలం, అద్దూరిపేట, బూర్జ

**నెత్తిన బొగ్గుల కుంపటి వద్దు**



పవర్ ప్లాంట్ పేరుతో ప్రజల నెత్తిన బొగ్గుల కుంపటి పెట్టవద్దు. ఉద్యోగాలు వస్తాయని జనాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. సోంపేట, కాకరాపల్లిలో పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఎందుకు ప్రజలు ఎదురు తిరిగారో చెప్పాలి. – వాబ యోగి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

## డీఎస్సీ ఎంపిక జాబితా విడుదల

శ్రీకాకుళం: జిల్లా నుంచి డీఎస్సీకి ఎంపికైన 538 మంది పేర్లతో ఎంపిక జాబితా విడుదలయ్యింది. డీఎస్సీలో మొత్తం పోస్టులు 543 కాగా, ఇదే స్థాయిలో ధ్రువపత్రాల పరిశీలన జరిపారు. అయితే ఏ కారణంగానో పూర్తిస్థాయిలో ఎంపిక జాబితా రాలేదు. ఎందుకు అనే కారణాలను వివరించలేదు. ఎంపికైన వారికి మరికొద్ది రోజుల్లో అమరావతికి తీసుకెళ్లి ధ్రువీకరణ పత్రాలు ఇస్తారని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అభ్యర్థులను తరలించేందుకుగాను ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేస్తారని సమాచారం. అయితే జిల్లాస్థాయిలో జరగాల్సిన ప్రక్రియను రాష్ట్రస్థాయికి మార్చి, ఏ ఒక్కరికీ పూర్తి సమాచారం తెలియకుండా గోప్యంగా నిర్వహిస్తుండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం



మోక్షగుండం విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అరసవల్లి: స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద పీఆర్ ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకొని ఇంజినీర్ల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో సుమారు 50 మంది ఇంజినీర్లు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పి.జగన్మోహనరావు, పీఆర్ డిప్లమో ఇంజినీర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి, పీఆర్ ఎస్ఈ కె.వీరన్నాయుడు, ఈఈలు ఎస్.రామకృష్ణ, జి.ప్రదీప్‌కుమార్, జి.రవి, జిల్లా డిప్లమో ఇంజినీర్ల సంఘ ప్రతినిధులు ఎం.పోలినాయుడు, ఎస్.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.